# కాటన్ మార్కెట్

## ఒక స్కెచ్

"అమరేంద్ర"

ఇప్పటి జనమేజయుడొకడిట్లా ప్రశ్నించాడు: 'దేవా! తాను నిన్నటిదినం బునప్రసంగ వశంబుగా సెలవిచ్చిన కాటన్ మార్కెట్ యొక్క పుణ్య చరిత్రంబును వివరించి నన్ను ధన్యునిచేయరే' అప్పుడు అన్నీ తెలిసిన వైశంపాయనుండు తెల్పిన కథాక్రమంబుయొక్క సారాంశం బెట్టిదన.

హేజనమేజయా! సావధానచిత్తంబున వినుము. అది కాటన్ మార్కెట్: అంటే దూదిబజారు. అక్కడ దూదీలేదు, బజారూలేదు కన కనే ఆగదికి ఆపేరు! ఆమధ్య కూర్చున్నదెవరో తెలుసా? ఈ కలియుగంలో ఇరవైయొకశతాబ్దంలో మానవరూపాన అవతరించిన కల్పవృక్షం! తనచుట్టూ చేరిఉన్నవాళ్ళందరికీ మేరుపర్వతం! ఇంతెందుకు, ఇతరులకి లాభాలుచూపే పదార్థంతో భూమిమీద అవతరించిన శ్రీమన్నారాయణమూర్తే అంటే బాగుంటుంది. ఇంక ఆయనచుట్టూ పరివేష్టించివున్న బృందమంతా ఎవరో తెలుసా? ఒక పరివారివదనమండలంబుల బరికించితేనె ఒక్కొక్కరియందు నెంతవైరాగ్యము, ఎంతవివేకము! కాటన్‌శాస్త్రి. కాటన్‌మూర్తి, కాటన్ శర్మ, కాటన్‌రావు. కాటన్‌కేసరులు. మరి ఈ ఉత్తరీయ సంశోభితు లెవరనా మీశంక? వారే శ్రీ కాటన్ కవివరేణ్యులు. వీరందరిలోనూ మను ష్యులు ధరించే దూది తప్ప వేరేదూదిలేదే మరి వీరిపేర్లన్నటిలోనూ దూది వచ్చి ఎందుకు చేరిందనా మీప్రశ్న? ఒకింత ఓపిక వహించండి. ఇది 'ఓపెనింగ్ టైమ్.' టెలిఫోను వచ్చింది. అంతా ఆత్రంగావిన్నారు. ఒక్కసారి గప్‌మన్నారు. 'ఓపెనింగ్ నంబర్ టూ!' అని.దూది మానవులంతా వివిధ పక్షులుగాచీలి వేరువేరు క్లోసింగ్ నంబర్‌లమీద పంచప్రాణాలూపెట్టుకుని డబ్బుచెల్లించారు. మధ్యకూర్చున్న బ్రోకరుగారు అందరిడబ్బూ సవినయంగా స్వీకరించి భద్రపరచాడు. అంతాలేచి బయలుదేరారు. ఏగ్రూపుకి ఆగ్రూపు తాము ఆశ్రయించింది 'కట్‌ఫిగర్' అవీ, మూడునెల్లనుంచీ అసంఖ్య దర్శనం లభించటంలేదు గనక ఈసారి తప్పదనీ గుసగుసలాడుకుంటూ బయటికి వచ్చారు, ఒకపక్షంగా కూడిన కాటన్‌శర్మా కాటన్‌రావూ తమరు ఏసంఖ్యని ఆశ్రయించారో ఇతరులకి తెలియనివ్వరాదనీ, ఈసారి పెట్టుబడి అంతా ష్యూర్‌గా తిరిగి వస్తుందనీ, కాటన్‌శాస్త్రీ కాటన్‌మూర్తీ దిలాసాగా అడుగులువేస్తూ తమరు ఆశ్రయించిన నంబర్ నాలుగు ఈసారి వచ్చి తీరుతుం దనీ, కాటన్‌కేసరు లిరువురూ ధనసంపాదనకి కాటన్‌మార్కెట్ అతినీతి యుతమైన, క్షేమకరమైన, లాభసహితమైన మార్గమనీ మానవజీవితానికి అనాసక్తియోగం ఆదర్శమనీ, విజయపరాజయాలకి లెక్కచేయరాదనీ తర్కించుకుంటూ, ఒకరి వెనకొకరు బయలుదేరారు రోడ్డుమీద. వీరందరి వెనకా ఉత్తరీయం మడత ఒకచేత్తో, కళ్ళజోడొకచేత్తో, సవరించుకుంటూ సన్నటికంఠంతో 'దూదిమయమే జీవనమూ!' అని పాడుతూ దూరాన పోలీసునిచూసి ఎందుకో భయపడి పక్కసందులోంచి నిష్క్రమించారు కాటన్ కవివరేణ్యులు.

జనమేజయుండు దేవా! పూర్తరీతులగ్గు దూది మానవుల జీవన క్రమంబెట్టిదన వైశంపాయనుండిట్లు సకౌతుకముగా జెప్పందొడంగె.

కాటన్‌శాస్త్రిగారు పన్నెండింటికి ఇంటికిచేరారు. ఇన్నాళ్ళనుంచీ భార్యతో తనకేదో ఉద్యోగం దొరికిందని చెప్తూవచ్చారు. ఆమె ఒకనాడడి గింది 'అయితే తమజీతమెంత? ఇంటికి తేవటంలేదేం?' శాస్త్రిగారు పెద్ద చిక్కులో పడినప్పటికీ మాటలకు తడుముకోనివారుకావున 'తరువాత సుఖంగా జీవించవచ్చని ప్రస్తుతం జీతంతో ఋణం తీరుస్తున్నాను' అని చెప్పగా ఆ ఇల్లాలు ఊరుకొన్నది. మళ్ళీ ఇన్నాళ్ళకి ఆమెపుట్టిన ఊరినుంచి వచ్చిన బంధువొకడు ఆమెతో ఉన్నరహస్యమంతా విడదీసిచెప్పివెళ్ళాడు. ఆమెకి పట్టరాని దుఃఖంవచ్చింది. రెండుఝాములు దాటాక భర్తవచ్చి ఎంతసేపు తలుపుకొట్టినా తియ్యలేదు. చివరికి శాస్త్రిగారు 'పీకేచెప్పేది. ఆఫీసుకి ఆలస్య మౌతుంది. త్వరగా తలుపుతియ్యి' అని అరిచారు. ఆమె రోషంతోలేచివొచ్చి తలుపుతీసింది మితిలేనికోపంతో 'మీకూ నాకూ ఒకటే ఆఫీసు!' అంటూ. శాస్త్రిగారు ఆశ్చర్యపూరితులై 'ఆదేమిటి, అల్లా అంటావ్?' అన్నారు. ఆమె ఘాటుగా ప్రత్యుత్తరమిచ్చింది 'దూది బజారులోనా మీకుద్యోగం?' శాస్త్రిగారు అగ్గివలె భగ్గునమండి 'ఛప్ నోరు ముయ్'అనిహుంకరించారు. ఆమె 'మూసుకుంటా; సర్వమంగళం చెయ్యండి.' శ్రీశాస్త్రిగారు రెండు కళ్ళలోంచీ నిప్పులు కురిపిస్తూ విప్పినచెప్పులు మళ్ళీ తొడుక్కుని చరచరా 'వెళ్ళిపోయారు బైటకి!'

కాటన్‌మూర్తిగారు ప్రాక్టీసులేని ప్లీడరు. ఉన్న పిత్రార్జితంలో చదువు కొగా మిగిలింది దూది బజారుకి మంగళహారతి! ప్రొద్దున్నే ఇంట్లో అయితే భార్య, బిడ్డలూకూడా ఆరంభిస్తారని భయంవేసి హోటెల్లో కాఫీతాగి సూట్ వేసుకుని అన్నిబజార్లు ప్రదక్షిణంచేసి అన్నంవేళకి ఇంటికిచేరుకుని నల్ల కోటూ, నెక్‌టై, హాటూ బూటూ ధరించి కోర్టుకి గబగబావెళ్ళి బార్ రూమ్‌లో కుర్చీలో, సబ్రహ్మచారులతో కబుర్లు చెప్పిచెప్పి. మూడింటివరకూ కునికిపాట్లుపడి హోటల్‌ని దర్శించి, దూది బజారుకివెళ్ళి బొంబాయినుంచి క్లోసింగ్ టెలిఫోన్‌కోసం రాత్రి పన్నెండుగంటలవరకూ పడిగాపులుపడి ఆవలిస్తూ ఇంటికిచేరటం వారి కార్యక్రమం. శ్రీవారి ధర్మపత్ని 'ఏమీలేన ప్పుడెందుకిక్కడ, మన ఊరువెళ్ళిపోదాం' అనసిరోజూ భర్తగారి ఆగ్రహ వర్షాన్ని అనుభవించనిరోజూ లేదు.

కాటన్‌శర్మగారు టెలిగ్రాఫ్ ఆఫీసులో పదిసంవత్సరాలు లైన్, డాట్‌లమధ్య ఉక్కిరిబిక్కిరై చివరకి కాటన్ కవివరేణ్యుల కావ్యామృతం పానంచేసి ఆ గీతలమధ్యనుంచీ చుక్కలమధ్యనుంచీ అమాంతం పారి పోయివచ్చి గౌరవప్రదంగా ధనార్జనచెయ్యాలని దూది బజారుకు చేరుకున్నారు.

ఎరుగున్నవారెవరైనా కనిపిస్తే ముఖం తిప్పేసుకునేవారు. అప్పటికీ వాళ్ల వదలక 'విశేషంలాంటి ఉద్యోగమెందుకు వదిలేశావ్?' అని ప్రశ్నిస్తే 'అక్కడ ఇంకొన్నాళ్ళుంటే నా జీవితమే ఒకచుక్కగానో గీతగానో మారిపోతుందేమోననే భయంతో!...' అని ఎల్లాగో సమాధానమిచ్చి దూసుకుని వెళ్ళిపోయేవారు.

కాటన్‌రావుగారు చిన్న జమీందారు. పొలాలు రైతులకిస్తే హక్కువాళ్ళదైపోతుందేమోననిభయంతో చాలాభాగం అమ్మేసి, యుద్ధకారణాలవల్ల బాంక్‌లు అంతక్షేమకరం కావని, కాటన్‌మార్కెట్‌కిచేరారు. కాటన్‌కేసరు లిరువురూ అధ్యాపకులే. అనాసక్తియోగావలంబకులు కావుననే ఒకేసారి రెండుపనులు చెయ్యగలుగుతున్నారు. ఇక కాటన్ కవివరేణ్యులు పూర్వకవుల నోడింపగలిగినంత ప్రౌఢకవి. ప్రస్తుతం వారి కవితా సామగ్రి ఏమిటంటే, దూదిబజారు, అక్కడి జయపరాజయాలు, అది ఎంతగౌరవప్రదమైన వ్యాపారమో, బ్రోకరు ఎం తసద్గుణ సంపన్నుడో!

ఈమహాత్ములందరూ దూది బజారుని వరించిన కారణంవలననే వారి పేర్లలోకూడా కాటన్ వచ్చిచేరింది. దూదిలేనిదే వాళ్ళకి జగత్తేలేదు. నిజంగా ఆలోచిస్తే దూది, బజారులో అసలేలేదు. వారిలో అంతకుమునుపే లేదు. ఇక ఉన్నదెక్కడంటే న్యూయార్కులో! అక్కడి దూది ధరల మార్పుమీద ఈ ధీమంతులు ఎవరికితోచిన సంఖ్యని వారు వరించి, ఆసంఖ్యకి డబ్బుచెల్లిస్తారు. వీళ్ళు చెప్పిన సంఖ్యవస్తే రూపాయికి ఎనిమిదిరూపాయలు అమాంతంగా ఒళ్ళో వచ్చి వాలవలసిందే. లేకపోతే చెల్లించిన రూపాయలు మాత్రమే మనదికాదనుకోవటం! ఈ మహత్తరవిధానంతో ధనార్జన చెయ్యటం సామాన్యులందరికీ సాధ్యంకాదు. దీనికి ఎన్నోసిద్ధాంతాలు, ఎన్నో మాత్రాలు ఎన్నోశాస్త్రాలు!

అంత, నవయుగ జనమేజయుండు నవీనవైశంపాయనుని 'ఆసిద్ధాంతంబుల వివరించి, ఆ పుణ్యచరితుల విజయవిధానమును దెలిపి నన్ను గృతార్థునొనర్పరే!'యని ప్రుచ్ఛించిన వైశంపాయనుండు నూతనోత్సాహంబుతోడ విల్లు వఃంపం దొడంగె:

ఈ సూక్ష్మంబులను సూక్ష్మబుద్ధితోడ నేరుంగునది. కాటన్‌శాస్త్రీ మూర్తీకలిసి ఒక అపూర్వమైన సిద్ధాంతం కనిపెట్టారు. 'కొన్నినెల్లనుంచీ రాకుండావున్న సంఖ్య నొకదాన్ని వరించి డబ్బుచెల్లించి ఏ పరిస్థితులలోనైనాసరే దాన్నివిడవకుండా పట్టుకునివేళ్ళాడటం. దీనికి వారు కపిపిస్టెప్సీ అని నామకరణంచేశారు. వార్‌టైమ్ అయింది కాని, లేకపోతే ఈ సిద్ధాంతానికి నోబుల్ ప్రైజ్ వచ్చేదికాదూ? ఈ సిద్ధాంతం కొన్ని అతిస్వల్పమైన విషయాలమీద ఆధారపడివుంటుంది. ఏమిటంటే: ప్రపంచపరిస్థితులు యధాప్రకారంగావుండాలి. బ్రోకరు సద్గుణసంపదలో మార్పుఉండకూడదు, అన్నిటికన్నా ముఖ్యం, కాటన్ మానవుడిగుండెపిబ్బరం చలింకుండావుండాలి. ఇంతే, ఈచిన్నషరతులన్నీ కుదిరితేచాలు, వెయ్యిరూపాయల పెట్టుబడితో సునాయాసంగా ఎనిమిదివేలు సంపాదించవచ్చు! కాటన్‌కేసరుల అనాసక్తత మాత్రం తక్కువదా? విజయంమీదే పంచప్రాణాలూ పెట్టుకుంటే ఖర్మం చాలక అపజయంవస్తే హార్టు ఫెయిలవుతుంది. కనుక నిష్కామంగా, నిశ్చలంగా అదొక కాలక్షేపంగా విజయపరాజయాలకి లొంగనిమనస్సుతో డబ్బుకడుతూవుండాలి.

కాటన్‌రావుగారింకో కొత్తసిద్ధాంతాన్ని కనిపెట్టి ఆచరణలోకి తీసుకొచ్చారు. ఇవాళ ఒకసంఖ్యమీద ఒకరూపాయి కడితే, దానిమీదే రేపు రెండు, ఎల్లుండి మూడు అల్లా అదిరావటమో రాకపోవటమో తేలేదాకా మొత్తం పెంచుతూవుంటే లాభం అపారమని!

ఇల్లా వ్యాపారం సాగిపోతుండగా, ఒక సర్వమానవ శ్రేయోభిలాషి ఈదూది మానవులందరికీ ఒకవిందు ఏర్పాటుచేసి దాంట్లో కాటన్‌కవిగారికి అగ్రస్థానమిచ్చి గౌరవించాడు. విందుముగిసి అతిథులంతా తాంబూలాలు నములుతుండగా హోస్టు చిన్న ఉపన్యాసం ఆరంభించాడు. "విద్యావంతులైన మీవంటివారుకూడా ఇటువంటి వ్యామోహాలలో పడటం, సునాయాసంగా ధనార్జనచెయ్యాలని సంకల్పించటం చాలా విషాదకరం. ఇది వ్యాపారమా? కాదు. లాటరీ, ఇంకా సజంగా చెప్పాలంటే జూదం. ఇన్నేళ్ళు విద్యాలయాలలో గడిపి చివరకి మీరంతా ఈ జూదంలోదిగి ధనమేకాకుండా మానసికశక్తులన్నిటినీ ధారపోస్తూ, అనవసరమైన ఆందోళనపడుతుండటంచూస్తే నాకు జాలివేస్తోంది. (కాటన్ శర్మని ఉద్దేశించి) ఈయనచూడండి విశేషంవంటి ఉద్యోగం కాళ్ళతన్నుకుని ఈజూదంలో వచ్చిచేరాడు. ఇదివరకు మనిషికీ ఇప్పటి మనిషికీ పోలికేలేదు. వెర్రివాడిలాగా రోడ్డుకి ఒకప్రక్కన నడుస్తూ ఏదో వేళ్ళతో లెక్కపెడుతూ ఎప్పుడూ దేనికోసమో ఎదురుచూస్తున్నవానివలె, ఏకోపోతే వెతుక్కుంటున్నవానిమాదిరిగా పోతూవుంటే ఎంతవిచారకరంగావుంది చూసేందుకు! బ్రోకరు మిమ్మల్ని ఉద్ధరించేందుకు అవతరించలేదు. ఇప్పటికైనా ఈమత్తునుంచి తెప్పరిల్లుకోండి" ఇంకోపాటి మనిషైతే ఈపాటికి కాటన్ మానవులంతా కలిసి హతామత్ చేసేవాళ్ళు. వృద్ధుడుగదా అని ఏదో ఉపేక్షవహించారు.

కాటన్ కవిగారు అమాంతంలేచి 'మీరు బ్రోకర్‌ని పల్లెత్తుమాట అనేందుకు వీలులేదు. నాటికల్పవృక్షమే నేటి బ్రోకరు! ఈసారికి ఊరుకున్నాం. ఇకెప్పుడూ అల్లా అనటానికి వీల్లేదు. అదీకాక కాటన్‌మార్కెట్ ఈ విశాలవిశ్వంలోవున్న ధనసంపాదనా పద్ధతులన్నిటిలోనూ ఉత్కృష్టమైనదీ, గౌరవనీయమైనదీ! అది జూదం అనటం అవివేకమే అంటాను. పోనీ, నేను పట్టినకుందేలుకి మూడేకాళ్ళు అన్నట్లు జూదమే అంటే నా ప్రత్యుత్తరం యిది: ఈజీవితమే గొప్పజూదం!' కరతాళధ్వనులు మిన్నుముట్టుతుండగా, కవివరేణ్యుని దేహమంతా ప్రశంసలతో నిండిపోతుండగా దూది మానవులంతా ఒక్కొక్కరే నిష్క్రమించారు.

ఆనాడు కవివరేణ్యులకి ఎక్కడినుంచో వెళ్ళకతీరని ఆహ్వానమొచ్చింది. అప్పటికి శ్రీవారు నాలుగోనంబరుని వరించి కొన్నివారాలనుంచీ దానికోసం చాలవందలు అర్పించి ఇకరాదని నిస్పృహతోచి ఆనాడు డబ్బు కట్టకుండా ప్రయాణమైవెళ్ళిపోయారు. తిరిగి వచ్చేసరికీ ఇన్నాళ్ళనుంచీరాని ఆసంఖ్యరావటం, కవిగారికి అపారనష్టం రావటం సంభవించింది. దానితో విరక్తిచెంది 'ఛీ, దీని తల్లికడుపుకాలా, వెధవదూది...ఇకచస్తే ఆ బజారులో అడుగుపెడతానా?' అని శపథంచేశారు! కవివరేణ్యులంతటి కాటన్‌ప్రియులే గుండెనిబ్బరాన్ని వీడి ఈరీతిగా జారిపోవటం చూసి మిగతా మానవులంతా తీవ్రవిషాదంలో మునిగిపోయినవారైనారు.

కాటన్‌శాస్త్రి, మూర్తి, శర్మారావూ, కాటన్‌కేసరులూ ఇప్పటికి ఇరవై రోజులనుంచీ ఒకరికి తెలియనివ్వకుండా ఒకరు ఒకేసంఖ్యకోసం మూడు గ్రూపులూ ఇంచుమించు మూడువేలు పెట్టుబడిపెట్టారు. పెట్టుబడి హెచ్చుతున్నకొద్దీ గుండెలు పీచుపీచుమంటున్నయ్. ఈ ఆందోళనతో వస్తుందా రాదా అనే మథనతో ఇరవైరోజులనుంచీ ఆహారం సహించక రాత్రి పన్నెండింటివరకూ టెలిఫోనుకోసం ఎదురుచూసి, తమ నంబరు రాకపోవటంవిని ఎక్కువౌతున్న నిరాశతో ఇంటికివచ్చి నిద్రపట్టక తిప్పలుపడుతున్నారు. కాటన్‌కేసరులు ఇద్దరూ విరాసక్తులు, నిశ్చలులు కనుక ఏమాత్రం చలించటంలేదు. కాని కాటన్‌శాస్త్రి ప్రభృతులు ఇక డబ్బుకట్టేందుకూ, కట్టకుండా మానేందుకూ సాహసంలేక పుట్టెడు దిగులుతో కుంగిపోతున్నారు. జీవితమే పెద్దజూదమని ధైర్యం తెచ్చుకున్న గుండెచెదిరిపోతోంది. ఇంక అంతా నిశ్చయించుకుని ఒకగ్రూపుకి తెలియకుండా ఒకరు ఒక అప్‌టుడేట్ న్యూమరాలజిస్టు దగ్గరికివెళ్ళారు. అయిదురూపాయల దక్షిణతో ఆ నిపుణుడైన న్యూమరాలజిస్టు ప్రతివాళ్ళకీ వాళ్ళనంబరు తప్పకుండా త్వరలో వచ్చితీరుతుందనీ, డబ్బుకట్టటం ఆపవద్దనీ చెప్పిపంపాడు. కాటన్‌శర్మ రిస్టువాచ్ అమ్మి, శాస్త్రి వెండిచెంబు అమ్మి మరింత ఆశతో, ధైర్యంతో డబ్బుకట్టి ఆరాత్రి టెలిఫోనుకోసం ఎదురుచూసి నిరాశతో ఇంటికిచేరారు. రాత్రంతా జాగరణచేశారు. కొంప నిలుస్తుందా కూలిపోతుందా? ఆమర్నాడు తప్పక వస్తుందేమోననే ఆశ వారిని వీడలేదు. తెల్లవారగానే న్యూమరాలజిస్టు దగ్గరికి పరిగెత్తితే ఇంకో అయిదు స్వీకరించి అందరికీ ఆవేళ తప్పకవస్తుందని చెప్పగానే అంతా తొందరతొందరగా దూది బజారుకి పరుగెత్తారు. ఏం విచిత్రం? స్వప్నంకాదుగదా? ఉహూ బోర్డులేదు, దూదిలేదు, బజారులేదు, బ్రోకరులేదు! అంతా అదృశ్యం! దూది మానవులంతా కుప్పున కూలబడ్డారు. ఇంతలో విందు ఇచ్చిన పెద్దమనిషి దేవుడిలాగావచ్చి కూలబడిపోయిన వారినందరినీ తన ఇంటికి తీసుకుపోయి ఆత్మహత్యలు చేసుకోకుండా కాపలా కాశాడు. కాటన్‌కేసరులు ఎంత నిష్కాములైనా ఈ బ్రోకరు పలాయనానికి మాత్రం దిగ్భ్రాంతులు కాకమానలేదు! ఇంత జరిగినా కవిగారు మాత్రం నిశ్చింతగా 'వైరాగ్యచింతామణి' అనే మహాకావ్యం రచిస్తూకూర్చున్నారు!

అంత జనమేజయుండు 'కృతార్థుడనైతిని దేవా తమ కృపవలన అలసటదీర్ప నొకపోడా దెప్పింపమందురా?' యని ప్రశ్నించిన. వైశంపాయనుండు 'హేజనమేజయా! కృతార్థతకేమి? ఒకకప్పు కాఫీని దెప్పింపుము!' అని మారుపలక తత్‌పానీయాహరణార్థము జనమేజయుండు త్వరితగతిని వెడలిపోయెను:

[పారిభాషికపదాలకి అర్థం తెలుసుకోవాలనేకోరిక కలిగితే, మీ పరిసరంలోవున్న దూది మానవులని గుర్తించి, వారిదగ్గరనుంచే గ్రహించవలసిందని మనవి]

# ఓ అంధగాయకుడా!

ఓ యంధగాయకుడ,
ఓ మధురగాయకుడ!

మీటు మోయీ వీణ
పాడు మోయీ పాట,
మోడు మనసులు కరుగ;

ఓ యంధగాయకుడ,
ఓ మధురగాయకుడ!

నీపాట నీమాట
నిఖిలలోకపు మాట,
నీవీణ నీమీటు,
లోకాన పరిపాటు;

ఓ యంధగాయకుడ,
ఓ మధురగాయకుడ!

నీకంటి కీ జగము
కాళరాతిరి నభము,
నీమాట లీ భువిని
నట్టడవి మార్మ్రోత;

ఓ యంధగాయకుడ,
ఓ మధురగాయకుడ!

మనసునంటిన మోహ
తిమిర జాలంబులన్
రాగసుధలో జ్యోతి
వెలిగించి తొలగించు;

ఓ యంధగాయకుడ,
ఓ మధురగాయకుడ!

తంత్రువుల బిగలాగి
వల్లకిని పైకెత్తి
చెవిచెంత జెయిచేర్చి
గానఝరి ప్రవహింపుమా!!

—శర్రా ప్రభాకరరావు.